సాక్షి
సిద్దిపేట
గురువారం : 16 ఫిబ్రవరి 2023



ఆనందం విషాదంగా.. 8లో..

ఆ అన్నదమ్ముల అనుబంధంపై విధికి కన్నుకుట్టింది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో అన్న దుర్మరణం చెందగా తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి.



ఫారెస్ట్ నర్సరీలో అగ్నిప్రమాదం

అందుగులపల్లి శివారు ఫారెస్ట్ నర్సరీలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.11 లక్షలు విలువజేసే సుమారు రెండు లక్షల వెదురు కర్రలు కాలిపోయాయి. 8లో..



ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం

దుబ్బాక 100 పడకల ఆస్పత్రిని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. 9లో..

న్యూస్‌రీల్

మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

సిద్దిపేటకమాన్: మహా శివరాత్రి సందర్భంగా సిద్దిపేట నుంచి వేములవాడ, కొమురవెల్లి దేవస్థానాల వద్దకు ఈ నెల 18, 19వ తేదీల్లో వెళ్లేందుకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 20 ప్రత్యేక బస్సులతో ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు, ప్రయాణికుల రద్దీ అనుగుణంగా బస్సులు నడుపుతామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'హిందూ ఏక్తా బైక్ ర్యాలీని విజయవంతం చేద్దాం'



మాట్లాడుతున్న శివకుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకోని ఈనెల 19న పట్టణంలో జరిగే హిందూ ఏక్తా బైక్‌ర్యాలీ, శోభాయాత్ర ను విజయవంతం చేద్దామని హిందూ వాహినీ జిల్లా అధ్యక్షుడు పొన్నాల శివకుమార్ అన్నారు. బుధవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం నుంచి శోభాయాత్ర, హిందూ ఏక్తా బైక్ ర్యాలీ ప్రారంభమై లాల్ కమాన్, నర్సాపూర్ చౌరస్తా, పాత బస్టాండ్, మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గల శివాజీ విగ్రహం వద్దకు చేరుకుంటుందన్నారు. సమావేశంలో రాష్ట్ర సహా సంయోజక్ శివాజీ గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యం, పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్, శివప్రసాద్, ప్రదీప్, వేణు మాధవ్, రాజు గౌడ్, కిరణ్, రాజు, రవి, అభిషేక్ తదితరలు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి



వినతిపత్రం ఇస్తున్న తిరుపతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వ్యవసాయానికి నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం విద్యుత్ భవన్‌లో జిల్లా విద్యుత్‌శాఖ అధికారికి ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రైతులు వరినాట్లు వేశారని, ఎండాకాలం దృష్ట్యా నాణ్యమై విద్యుత్‌ను అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, రైతు సంఘం మండల నాయకుడు పొనుగంటి శ్రీనివాస్ రెడ్డి, రమేష్, మల్లయ్య పాల్గొన్నారు.

1.34 లక్షల మందికి కంటి పరీక్షలు

సిద్దిపేటకమాన్: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కంటి పరీక్షల నిర్వహణ కొనసాగుతోంది. ఇప్పటివరకు 47 బృందాల ద్వారా వైద్య సిబ్బంది 1,34,126 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 29,471 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ బుధవారం తెలిపారు. మరో 22 వేల మందికి కంటి అద్దాలు ఆర్డర్ పెట్టినట్లు వివరించారు.

శివరాత్రి మహోత్సవానికి ఆహ్వానం



ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేటకమాన్: మహా శివరాత్రి పర్వదివాన్ని పురస్కరించుకుని పొట్లపల్లి రాజేశ్వర స్వామి దేవస్థానంలో మహోత్సవానికి హాజరుకావాలని అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌కు బుధవారం ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ, దేవాలయ కార్యవర్గ సభ్యులు, సర్పంచ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

సమరానికి సై

నేడు సీఎం కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ సీజన్–3 ప్రారంభం



స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



సాక్షి, సిద్దిపేట: క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతుందా? అని ఎదురు చూస్తున్న సీఎం కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ సీజన్–3 ఆరంభానికి సమయం ఆసన్నమైంది. ఈ మహా సంగ్రామానికి సిద్దిపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ క్రికెట్ స్టేడియం ముస్తాబైంది. నేడు(గురువారం)సాయంత్రం మంత్రి హరీశ్‌రావు, సినీహీరో న్యాచురల్ స్టార్ నాని, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు చేతుల మీదుగా ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ బిగ్ ఫైట్‌లో సిద్దిపేట నియోజకవర్గంలోని 373 టీంలు.. 5,595 మంది క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు మూడేళ్లుగా మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు.

వంద రోజులు పాటు మ్యాచ్‌లు

- 5,595 మంది క్రీడాకారులను 8 విభాగాలుగా విభజించారు. అర్బన్ నుంచి 139 టీంలు, రూరల్ నుంచి 234 టీంలు పాల్గొనున్నాయి. ఇటీవల తలపడే టీంలకు సంబంధించి క్రీడాకారుల సమక్షంలో డ్రా తీశారు.
- రోజుకు ఐదు నుంచి 8 మ్యాచ్‌ల చొప్పున 100 రోజుల పాటు టోర్నమెంట్ జరగనుంది. ఏ ఒక్క మ్యాచ్ ఓటమి చెందినా టోర్నమెంట్‌ను వైదోలుగుతారు.
- 10 ఓవర్లతో మ్యాచ్ జరగనుంది. ప్రతీ సిక్స్‌కు రూ.500, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌కు రూ.1,000 నగదును అందించనున్నారు.
- హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన అంపైర్లు, స్కోరర్‌ల సమక్షంలో మ్యాచ్‌లు కొనసాగనున్నాయి.
- క్రిక్ హీరోస్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో స్కోర్, ఆన్‌లైన్‌లో మ్యాచ్‌ను వీక్షించవచ్చు. క్రీడాకారుల వ్యక్తిగత స్కోర్ వివరాలను సైతం ప్రత్యేకంగా పొందుపరచనున్నారు.
- ప్రతీ క్రీడాకారునికి ఉచితంగా జెర్సీలను , బాల్స్‌ను ఇస్తున్నారు. అవసరం అయితే బ్యాట్‌లు, ప్యాడ్‌లను అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.
- ఇప్పటికే ఈ ట్రోఫీ–2022 సంవత్సరంలో దేశంలోనే బిగ్గెస్ట్ టోర్నీగా క్రిక్ హీరోస్ వారు గుర్తించారు. మంత్రి హరీశ్‌రావును బెస్ట్ అర్గనైజర్‌గా ప్రకటించారు. ఈ వేదికగా ఈ అవార్డును సైతం అందించనున్నారు. దీంతో జాతీయ స్థాయిలో ఈ టోర్నమెంట్‌కు గుర్తింపు వచ్చింది.
- జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా స్టేడియాన్ని సిద్ధం చేశారు. ప్రేక్షకులు కుర్చునేందుకు పెవిలియన్ ఏర్పాటు చేశారు.
- క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేందుకు నాలుగు నెట్‌లను రెడీ చేశారు. అలాగే ఈ సారి ప్రత్యేకంగా పర్మినెంట్‌గా ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. స్టేడియం చుట్టూ ఇప్పటికే ఇనుప కంచెను ఏర్పాటు చేశారు.
- ఇందులో గెలుపొందిన విజేతకు రూ.2లక్షల నగదుతో పాటు ట్రోఫీ, రన్నరప్‌కు రూ.లక్ష నగదును అందించనున్నారు. అలాగే మ్యాన్ ఆఫ్ ద సిరిస్‌కు జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదును ఇవ్వనున్నారు.
- ఈ సందర్భంగా హీరో నాని నటిస్తున్న దసరా సినిమా ప్రమోషన్‌లో భాగంగా పోస్టర్ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

**373 టీంలు..
5,595 మంది క్రీడాకారులు**

- 100 రోజుల పాటు కొనసాగనున్న పోటీలు
- విజేతకు రూ.2 లక్షలు.. రన్నరప్‌కు రూ.లక్ష నగదు
- ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు, సినీ హీరో నాని, క్రికెటర్ రాయుడు

జాతీయ స్థాయిలో ఏర్పాట్లు



క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ టోర్నమెంట్‌ను మంత్రి హరీశ్‌రావు నిర్వహిస్తున్నారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మూడేళ్లుగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నాం. గత సీజన్‌లలో ఆడిన ఇద్దరు క్రీడాకారులు రంజీ ట్రోఫీకి ఎంపికయ్యారు. జాతీయ స్థాయి టోర్నమెంట్ స్థాయిలో ఏర్పాట్లు చేశాం. సీజన్–3 ప్రారంభోత్సవానికి మంత్రి హరీశ్‌రావు, సినీ హీరో నాని, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు రానున్నారు. –కలకుంట్ల మల్లికార్జున్, వేణుగోపాల్‌రెడ్డి, నిర్వాహకులు

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న నాగిరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రత్యామ్నాయ పంటల సాగు విధానంపై రైతులు దృష్టి సారించాలని రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి అన్నారు. బుధవారం చిన్నకోడూరులో భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పొద్దు తిరుగుడు పంటపై క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మతో కలిసి ఆయన మాట్లాడారు. పంట మార్పిడి వల్ల నేల సారవంతం అవుతుందన్నారు. రైతులు సాగులో అధునాతన సాంకేతిక పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అలాగే నూనె గింజలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరాలన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మతూర్, డాక్టర్ సతీశ్‌కుమార్, డాక్టర్ సురేష్, డాక్టర్ మీనా, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నిహారిక, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వంశీ సాగులో మెలకువలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, ఏఓ జయంత్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు షురూ..



పరీక్షల తీరును పరిశీలిస్తున్న సూర్యప్రకాశ్

కొండపాక(గజ్వేల్): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రారంభమయ్యాయి. కాగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాశ్ కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చూసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు రాసేటప్పుడు విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. ఈ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణను జిల్లా వాప్తంగా రెండు సెషన్లుగా విభజించారు. ఉదయం జనరల్ విభాగంలో 909 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 881 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,694 మంది విద్యార్థులకు గాను 1,207 హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో జనరల్ విభాగంలో 956 మంది విద్యార్థులు పరీక్షలు రాయల్సి ఉండగా 875 మంది, ఒకేషనల్ విభాగంలో 1,313 మంది విద్యార్థులకు గాను 1,067 మంది విద్యార్థులు హాజరయ్యారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



గాయత్రి



రాధిక



సిద్ధార్థ

మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ స్థాయిలో జరిగే బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్ చాంపియన్ షిప్‌కు ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య బుధవారం మిరుదొడ్డిలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 10 నుంచి 12 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో బాలుర విభాగంతో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వేముల సిద్ధార్థ (మిరుదొడ్డి తెలంగాణ మోడల్ స్కూల్), ఎంపికయ్యాడు. బాలికల విభాగంలో జె. గాయత్రి, బి. రాధిక (శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్, ఓల్డ్ ఎంఐజీ) రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఈ ముగ్గురు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో 16 నుంచి జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

డబుల్ ఇళ్లకు దరఖాస్తుల ఆహ్వానం



కలెక్టర్
ప్రశాంత్‌జీవన్ పాటిల్

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలో మిగిలిన 285 డబుల్ బెడ్రూం ఇళ్లకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుబ్బాక పట్టణంలో 872 ఇళ్ల నిర్మించగా వాటి కేటాయింపునకు 1,602 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. అందులో 587 మంది లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశామని తెలిపారు. మిగిలిన 285 ఇళ్లకు 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 3 రోజులు దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. గతంలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపికైన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- బస్తీ దవాఖానా పేద ప్రజల ఆరోగ్యానికి దోస్తీ
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



బస్తీ దవాఖానాలో ఫార్మసీని పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: పేద ప్రజల సుస్తీని నయం చేసే దోస్తీలు ఈ బస్తీ దవాఖానాలు అని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో బస్తీ దవాఖానను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లోపల గదులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ఈ దవాఖానాలో ఉచితంగా 158 రకాల మందులు, 57 రకాల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. త్వరలోనే పరీక్షల సంఖ్య 137కు చేరుతుందన్నారు. మొదటగా హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలు ప్రారంభించి రెండు కోట్ల మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. సిద్దిపేట పట్టణంలో నాలుగు బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే ఐదోవది పొన్నాల హరీశ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సిద్దిపేటలో ఐదు పడకలతో పాలియేటివ్ కేర్‌ను, ఆలన వాహనం, కేన్సర్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలు చేసేలా క్యాథ్‌లాబ్‌ను తీసుకొచ్చామన్నారు.

ఆదివారం కూడా అందుబాటులో..

పేద ప్రజలకు ఉచిత నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందించేందుకు సీఎం కేసీఆర్ సూచనతో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బస్తీ దవాఖానాలు ఆదివారం కూడా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాట నుంచి డెలివరీ వరకు వైద్య పరీక్షలు నిర్వహించుకునే విధానాన్ని తెలియజేస్తూ మంత్రి పేరు మీదుగా తయారు చేసిన ఇన్విటేషన్ కార్డును మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు. త్వరలోనే లింగారెడ్డిపల్లిలో పల్లె దవాఖానా ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తామన్నారు. అంతకుముందు నెహ్రూ పార్క్ సమీపంలో కార్మిక సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పట్టణంలోని బారాయిమామ్ చౌరస్తాలోని ముదిరాజ్ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్మెన్ కడవెర్గు మంజులరాజనర్సు, పాల సాయిరాం, డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, విజేందర్‌రెడ్డి, బందారం రాజుశ్రీలత, వైద్య సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆగస్టులో సిద్దిపేటకు రైలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆగస్టు నాటికి జిల్లా కేంద్రానికి రైలు వస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నీలకంఠేశ్వర ఆలయం ప్రాంగణంలో నిర్మించిన ధ్యాన మందిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ధ్యాన మందిరంతో నీలకంఠ సమాజానికి గుర్తింపు లభించిందన్నారు. ప్రతిరోజు యోగా, ప్రాణాయామం, వాకింగ్ చేస్తే 90% రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. కోమటిచెరువుకు మూడింతల అద్భుతమైన పర్యటక కేంద్రంగా రంగనాయక చెరువును రూ.100 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నామన్నారు. సిద్దిపేట భవిష్యత్తులో రైల్వే కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు. సిద్దిపేటకు రోడ్లు, రైలు, నీటీ సౌకర్యాలు పూర్తయ్యాయని, ఇక ఒక విమాన ప్రయాణం సౌకర్యం మాత్రమే మిగిలిందన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



కార్యక్రమంలో యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన వీధుల్లో ఏటిగడ్డ కిష్టాపూర్ తండావాసులు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్అండ్ఆర్ కాలనీలోని ఏటిగడ్డ కిష్టాపూర్(మొగలిచెరువు) తండావాసులు సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటం వద్ద భోగ్ బండార్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. గిరిజనుల, బంజారాల ఉద్ధరణకు సేవాలాల్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం తాండా నుంచి గజ్వేల్ మీదుగా ప్రజ్ఞాపూర్ చౌరస్తా వరకు తిరిగి గజ్వేల్ మీదుగా ఆర్అండ్ఆర్ కాలనీలోని మొగిలి చెరువు వరకు నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, తాండా వాసులు, యువకులు పాల్గొన్నారు.

ఊరంతా అమ్మతల్లి

చికెన్‌ఫాక్స్‌తో అంక్షాపూర్‌లో అవస్థలు



మంచం పట్టిన చిన్నారులు



ఇబ్బంది పడుతున్న తండ్రీకొడుకు

నంగునూరు(సిద్దిపేట): ఊరంతా అమ్మతల్లి సోకడంతో అంక్షాపూర్ గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. శరీరమంతా బొబ్బలు, దురద, జ్వరం, నీరసంతో బాధపడుతున్నామని వాపోతున్నారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఊరు ఊరంతా చికెన్‌ఫాక్స్‌తో అల్లాడుతోంది. నంగునూరు మండలం అంక్షాపూర్‌లో కొన్ని రోజుల కిందట చిన్నారులకు చికెన్‌ఫాక్స్ సోకింది. వ్యాధి త్వరగా వ్యాప్తి చెందడంతో చిన్నారులతో పాటు పెద్దలకు సోకింది. దీంతో జ్వరం, నీరసంతో బాధపడుతున్నారు. ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు మంచం పట్టడం, పిల్లలకు తల నుంచి ఒంటి నిండా బుగ్గలు ఏర్పడడంతో పాటు కంటిలో ఆనవాళ్లు కనిపించడం వ్యాధి తీవ్రతకు అద్దం పడుతోంది. అలాగే వ్యాధి బారిన పడి తగ్గినవారు నీరసంగా ఉండటం, శరీరంపై మచ్చలు తగ్గకపోవడం, జ్వరం పూర్తిగా నయం కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

వేధిస్తున్న వేపాకు కొరత

గ్రామాల్లో అమ్మతల్లి సోకితే పోచమ్మ తల్లి ఆగ్రహించిందని ప్రజలు భావిస్తారు. వైద్య చేయించుకుంటే అమ్మవారికి కోపం వస్తుందని, ఇంట్లోనే జాగ్రత్తలు తీసుకుంటూ ప్రథమ చికిత్స చేసుకుంటున్నారు. శరీరంపై ఏర్పడ్డ బుగ్గలపై వేపాకు పూతగా రాయడం, నూనె, పప్పు వస్తువులు తినకుండా పత్యం చేస్తూ ప్రతి రోజు శుభ్రమైన బట్టలు వేసుకుంటారు. కానీ ఈ సంవత్సరం వేప చెట్టకు తెగుళ్లు సోకడంతో పూర్తిగా ఎండి మోడు వారడంతో వేపాకుకు కొరత ఏర్పడింది. దీంతో గ్రామస్తులంతా వేపాకు కోసం చుట్టు పక్కల గ్రామాల్లో వెతుకుతున్నారు. చిన్నారులకు మాత్రమే సోకే ఈ వ్యాధి గ్రామంలో పెద్దవారికి సైతం సోకడంతో ఆందోళన తీవ్రతరమైంది.

డాక్టర్లు అవగాహన కల్పించాలి

గ్రామంలో చాలా మందికి చికెన్‌ఫాక్స్ సోకడంతో జ్వరం, నీరసంతో బాధ పడుతున్నారు. వ్యాధి త్వరగా వ్యాప్తి చెందుతున్నందున వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలి. వ్యాధి సోకి తగ్గిన వారు, తగ్గని వారు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలను వివరించాలి.
–పిసకెశ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్

క్లుప్తంగా

కల్వర్ట్‌ను ఢీకొన్న కారు: తప్పిన ప్రమాదం



కల్వర్టును ఢీకొన్న కారు

కొల్చారం(నర్సాపూర్): కారులో ఏడుపాయల వన దుర్గాదేవి దర్శనానికి ఇద్దరు భక్తులు వచ్చారు. అమ్మవారిని దర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొత్తంశెట్టి పల్లి గ్రామ శివారులో మెదక్ నర్సాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టారు. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్



లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెద్దశంకరంపేట(మెదక్): 161వ జాతీయ ప్రధాన రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేట ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం కోళాపల్లి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి జిల్లా వర్ని వెళ్తున్న బియ్యం లారీని తనిఖీ చేయగా 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో లారీని సీజ్ చేసి పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహన డ్రైవర్ గుజరాత్ రాష్ట్రానికి చెందిన సాగర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అరుదైన శస్త్రచికిత్స

దుబ్బాక: దుబ్బాక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు అరుదైనా శస్త్రచికత్స చేశారు. దుబ్బాకకు చెందిన అమీర్ అలీ(97) కొన్నేళ్లుగా హైడ్రోసిల్, హెర్నియాతో బాధపడుతున్నాడు. బుధవారం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చగా ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో వైద్యులు రంజిత్, రాఘవేందర్ శస్త్రచికిత్స గడ్డను విజయవంతంగా తొలగించారు.

ఏటీఎం బ్యాటరీలు చోరీ

పటాన్‌చెరుటౌన్: ఏటీఎంలో బ్యాటరీలు చోరీకి గురైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏటీఎం నిర్వాకులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఆర్టీఏ కార్యాలయ సమీప హిటాచీ ఏటీఎంలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న ఏటీఎం నిర్వాహకులు ఘటనా స్థలానికి వచ్చి క్యాబిన్‌లో పరిశీలించగా ఏటీఎంకు చెందిన మూడు బ్యాటరీలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. నిర్వాహకులు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ హౌస్, ఫ్లాట్, ఓపెన్ ఫ్లాట్, ల్యాండ్, వ్యక్తిగత, వ్యవసాయ భూములపై అతి తక్కువ వడ్డీతో ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. ✆ 9988199941. [T-1753]

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టెక్ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 9463846068. [T-1745]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781830]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-9790]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 9493094163. [M-1190574]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు, కావలెను, ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18 k ఏజెంట్స్ కమీషన్ 3k ఫోన్: 7569955551, 9848571888. [H-786836]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆనందం విషాదంగా

- తమ్ముడి నిశ్చితార్థానికి బయలుదేరిన కుటుంబం
- చెట్టును ఢీకొన్న కారు
- అన్న దుర్మరణం, తమ్ముడికి గాయాలు
- బస్సులో ఉండటంతో తండ్రికి తప్పిన గండం



మృతుడు అరవింద్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆ అన్నదమ్ముల అనుబంధంపై విధికి కన్నుకుట్టింది. వారిని శాశ్వతంగా విడదీసింది. వరుస వేడుకల్లో విషాదాన్ని చిమ్మింది. గోదావరిఖనికి చెందిన ఓ కుటుంబంలో శోకం మిగిల్చింది. ఆనందం విషాదంగా మారింది. హైదరాబాద్‌లో అన్న గృహప్రవేశం అనంతరం తిరిగి గోదావరిఖనికి కారులో బయలుదేరారు. తెల్లవారితే తమ్ముడి నిశ్చితార్థం అక్కడ జరగాల్సింది. ఇంతో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. అన్న అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇతర కుటుంబసభ్యులు క్షత గాత్రులయ్యారు. కారులో చోటు లేక బస్సు ఎక్కిన తండ్రికి గండం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి.

మంచిర్యాల జిల్లా గోదావరిఖనికి చెందిన తాటిపాముల అరవింద్(32), భార్య నవ్య, తల్లి కవిత, అత్తమ్మ భారతి, పిల్లలు హిమాన్స్, కృతికశ్రీ, సోదరుడు మహేశ్ హైదరాబాద్‌లో అరవింద్ గృహ ప్రవేశానికి కారులో వెళ్లారు. గురువారం గోదావరిఖనిలో మహేశ్ నిశ్చితార్థం ఉన్నందున బుధవారం ఉదయం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. తండ్రి రాజనర్సయ్యకు కారులో చోటు లేకపోవడంతో బస్‌లో బయలుదేరాడు. చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ శివారులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అరవింద్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన మిగలిన వారిని 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. మృతుడి తండ్రి రాజనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.



అంబులెన్స్‌లో క్షతగాత్రులను తరలిస్తున్న దృశ్యం



కారు ఢీకొనడంతో పడిపోయిన ఆటో

స్కూల్ ఆటోను ఢీకొన్న కారు

చిన్నకోడూరు నుంచి ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌కు వెళ్తున్న స్కూల్ పిల్లల ఆటో ఇబ్రహీంనగర్ వద్ద పల్టీ కొట్టిన కారును గమనించారు. అది చూసేందుకు రోడ్డు పక్కన నిలిపే క్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు ఆటోను ఢీ కొంది. దీంతో ఆటోలో ఉన్న భాను ప్రకాష్, అశోక్, అంబికకు తీవ్ర గయాలయ్యాయి. వెంటనే 108 సిబ్బంది సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులను మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. గాయపడ్డ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. తల్లి దండ్రులు ఆందోళన చెందవద్దని తానున్నాని భరోసి ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ కిషోర్ కుమార్ తెలిపారు.

సేవాలాల్ జీవితం ఆదర్శం

- తండాలకు పంచాయతీగా గుర్తింపు
- రూ.2 కోట్లతో బంజారా భవన్
- త్వరలో పోడు భూములకు పట్టాలు
- ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్ రావు



సేవాలాల్ చిత్రపటానికి నమస్కరిస్తున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సంఘ సేవకుడు సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం మనకు ఆదర్శమని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో సేవాలాల్ మహారాజ్ 284 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. సేవాలాల్ చేసిన సేవలను కొనియాడారు. లిపిలేని బంజారా భాషను ఒక పద్ధతిగా మార్చడం వల్ల పది కోట్లకు పైగా ఉన్న లంబడా ప్రజలు ఒకే రకంగా సంభాషించుకుంటున్నారన్నారు. ప్రజల కోసం సేవాలాల్ అనేక ఉద్యమాలు చేశారన్నారు. మనిషి మనిషిగా ఎలా ఎదగాలో నేర్పిన గొప్ప గురువని అభివర్ణించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజన ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతి అధికారికంగా ప్రకటించి, 6 నుంచి 10 శాతం రిజర్వేషన్లకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కిందన్నారు. 500 జనాభా దాటిన 2471 గిరిజన తండాలు, గూడెంలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల చిరకాల ఆకాంక్షను సీఎం నెరవేర్చారన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రతీ గిరిజన గ్రామ పంచాయతీ సొంత భవనం కోసం రూ 20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. మద్యం దుకాణాల లైసెన్స్ కేటాయింపులో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించిందన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో 1650 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన విద్యార్థుల కోసం 183 వసతి గృహాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రూ.2 కోట్లతో బంజారా భవన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. నెల రోజుల్లో బీడు భూములకు పట్టాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, పాల సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి



మాట్లాడుతున్న నందారెడ్డి

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యకలాపాలతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి రామాయంపేటలో జరిగిన ప్రజాగోస, బీజేపీ భరోసా కార్యక్రమంలో మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలను సీఎం తుంగలో తొక్కాడని ఆరోపించారు. రామాయంపేట పట్టణంలో అభివృద్ధి అడుగంటిందన్నారు. పట్టణంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికార పార్టీ పట్టించుకోవడంలేదన్నారు. రెండు పడకల ఇళ్లు, దళిత బంధు, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, ఇతర హామీలు ఏమయ్యాయని నందారెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. సమావేశంలో పార్టీ పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు సునీత, పార్టీ నాయకులు శ్రీరాం ముత్తయ్య, బల్ల పెంటయ్య, ఇతర నాయకులు ఎల్లాగౌడ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ నర్సరీలో అగ్నిప్రమాదం

రూ.11 లక్షల విలువజేసే వెదురు కర్రలు దగ్ధం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని అందుగులపల్లి గ్రామశివారు ఫారెస్ట్ నర్సరీలో అగ్నిప్రమాదం సంభవించింది. బుధవారం నర్సరీ నిర్వాహకుడు రమేష్ వచ్చి చూడగా వెదురు కర్రలకు మంటలు వ్యాపించడంతో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి రవికుమార్‌కు సమాచారం తెలిపాడు. దీంతో ఆయన జిల్లా ఉన్నతాధికారులతో పాటు ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చాడు. నర్సాపూర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పినా వెదురు కర్రలు కాలిపోయాయి. అనుమానాస్పదస్థితిలో జరిగిన ప్రమాదంలో రూ.11 లక్షలు విలువజేసే సుమారు రెండు లక్షల వెదురు కర్రలు కాలిపోయాయని డిప్యూటీ రేంజ్ అధికారి రవికుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎఫ్ఓ రవిప్రసాద్ సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్ అధికారుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



పంచనామా నిర్వహిస్తున్న ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ →

పొద్దు తిరుగుడు సాగుపై శిక్షణ



శిక్షణ అనంతరం శాస్త్రవేత్తలు, ప్రతినిధులు

సిద్దిపేటరూరల్: పొద్దు తిరుగుడు సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ, కొత్త సంకర రకం తిల్హాన్ టెక్ ఎస్‌యూఎస్‌హెచ్-1 విత్తనోత్పత్తి క్షేత్రాల సందర్శన కార్యక్రమాన్ని తోర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానం, భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ సంయుక్తంగా నిర్వహించారు. భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కె మాథుర్, విత్తన పరిశోధన, సాంకేతిక కేంద్రం, రాజేంద్రనగర్ డైరెక్టర్ (సీడ్స్) డాక్టర్ పి.జగన్ మోహన్‌రావు హాజరయ్యారు.

పొద్దుతిరుగుడు పంట ప్రాముఖ్యత, కొత్త సంకర రకం తిల్హాన్ టెక్ ఎస్‌యూఎస్‌హెచ్ 1 విశిష్ట లక్షణాలు, విత్తనోత్పత్తిలో కృషి చేస్తున్నందుకు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలను అభినందించారు. అనంతరం పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో పొద్దుతిరుగుడు పంట సాగు విస్తీర్ణం పెంచడంలో వ్యవసాయ పరిశోధన స్థానం పాత్రని వివరించారు. కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్డ్ కులాలకు చెందిన 51 మంది రైతులకు టార్పాలిన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తల బృందం, పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఉమారాణి, శ్వేత, సరిత, సాయినాథ్, శ్రీనివాస్, సర్పంచ్‌లు సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

జగదేవ్‌పూర్(గజ్వేల్): మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని రాయవరం గ్రామస్తులు తెలిసిన వివరాలు ప్రకారం ఇలా ఉన్నాయి. 55 ఏళ్ల గ్రామస్తుడు మల్లన్నసాగర్ ముంపు గ్రామానికి చెందిన ఓ కుటుంబ రాయవరం గ్రామంలో నాలుగేళ్ల క్రితం వచ్చి ఇక్కడే స్థిరపడింది. ఆ కుటుంబంతో సదరు వ్యక్తి సన్నిహితంగా ఉంటున్నాడు. జనవరి 26న బాలికకు మాయ మాటలు చెప్పి వ్యవసాయ బావి దగ్గరికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెప్పితే చంపేస్తానని బెదిరించడంతో బాలిక ఎవరికీ చెప్పలేదు. వారం రోజులుగా తీవ్ర రక్తస్రావంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యపరీక్షలు చేసిన వైద్యులు లైంగిక దాడి జరిగిందని చెప్పారు. జరిగిన విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు జగదేవ్‌పూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ విషయంపై జగదేవ్‌పూర్ ఎస్ఐని వివరణ కోరగా స్పందించలేదు.

వ్యక్తి దారుణ హత్య

మెదక్ మున్సిపాలిటీ: ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రషీద్ కాలనీకి చెందిన నిజాముద్దీన్(45) గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేశారు. పంచముఖి కాలనీ శివారు నిర్మానుష్య ప్రాంతం కావడంతో మధ్యాహ్నం వరకు మృతదేహాన్ని ఎవరూ గుర్తించలేదు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ సైదులు, సీఐ మధు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. హత్య జరిగిన ప్రాంతంలో మృతుడి బైక్ ఉంది. తెలిసిన వారితో వచ్చి ఉంటాడని, మంగళవారం రాత్రి హత్య జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు.

వాటర్ హౌస్‌లో మృతదేహం లభ్యం

పటాన్‌చెరు: వాటర్ హౌస్‌లో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామానికి చెందిన బేగరి కృష్ణ(50) ఈనెల 13వ తేదీ రాత్రి బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఇంటికి తిరిగి రాకపోవడతో కుటుంబ సభ్యులు అతడి కోసం వెతుకుతుండగా 15వ తేదీన పాశమైలారం కొత్త కాలనీ సమీప వాటర్ హౌస్‌లో కృష్ణ మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సుగుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బుధవారం పేట ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని శివాయిపల్లి గ్రామానికి చెందిన దండు బాగయ్య(45) పేటలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి తోటి కార్మికుడు రాజుతో కలిసి బైక్‌పై తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో పేట శివారులో వీరోజిపల్లికి చెందిన మచ్కూరి సంగమ్మ(45)ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. బైక్ పైఉన్న దండు బాగయ్య కిందపడటంతో అతడి తలకు తీవ్రగాయమైంది. వెంటనే అతడిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సంగమ్మ, రాజుకూ తీవ్ర గాయాలయ్యాయి. వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై మృతుడి అన్న భీమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హత్నూర, సంగారెడ్డి: చికిత్స పొందుతున్న కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందినట్లు హత్నూర ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హత్నూర మండలం గుండ్ల మాచునూర్ శివారులోని హానర్ పరిశ్రమలో నాలుగు నెలల క్రితం ఝార్ఖండ్ రాష్ట్రం పురిలియా జిల్లా పంచ కాత్రాజు గ్రామానికి చెందిన నరేన్ బౌరీ (38)కాంట్రాక్ట్ కార్మికుడిగా చేరాడు. సోమవారం పరిశ్రమలో విధులు నిర్వహించాడు. మంగళవారం షిఫ్ట్ మారుతున్న క్రమంలో ఒక్కసారిగా కిందపడిపోయాడు. దీంతో పరిశ్రమ ప్రతినిధులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు ప్రబీర్ సాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సదాశివపేట(సంగారెడ్డి): చికిత్స పొందుతూ మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. బుధవారం సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 13వ తేదీ సాయంత్రం తహసీల్దార్ కార్యాలయ సమీపంలో మతిస్థిమితం లేని వ్యక్తి ఉన్నాడని 100కు సమాచారం వచ్చిందన్నారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. మృతుడు కొన్ని రోజులుగా సదాశివపేట పట్టణంలో తిరుగుతుండేవాడు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. వివరాలకు సదాశివపేట సీఐ 8712656721 ఫోన్‌లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు..

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాశ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని నరేంద్రకాలనీకి చెందిన చింతపల్లి రమేశ్(35) ట్రాలీ ఆటో నడుపుతున్నాడు. మంగళవారం ఇంచి నుంచి వెళ్లాడు. సాయంత్రం భార్య సునీత ఫోన్ చేయగా కొంచం ఆలస్యంగా వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. దీంతో బుధవారం ఉదయం అమీన్‌పూర్ సమీపంలో ఉన్న వైన్స్ షాపు పక్కన ఓ వ్యక్తి మృతిచెందాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. పోలీసులు మృతుడి భార్యకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతిగా మద్యం తాగి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికలో వివరాలు తెలుస్తాయన్నారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడి..



ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

కోహీర్(జహీరాబాద్): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకొంది. కోహీర్ ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సజ్జాపూర్ గ్రామంలో ప్రశాంత్‌రెడ్డి(20) తన పొలానికి నీరు పెట్టేందుకు మోటారు వేయడానికి వెళ్లి ప్రమాద వశాత్తు బావిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న తల్లిదండ్రులు తోటి రైతుల సహాయంతో అతడిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. బావిలో నీరు అధికంగా ఉండటంతో మృతదేహాన్ని వెలికి తీయడంలో జాప్యం జరిగింది. బూచనెల్లి నారాయణరెడ్డికి ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు. ఏకైక కుమారుడు ప్రశాంత్‌రెడ్డి ఇంటర్ వరకు చదువుకొని తండ్రికి వ్యవసాయ పనుల్లో సహాయం చేసేవాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



బిపిన్ మృతదేహం

రామాయంపేట(మెదక్): రామాయంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బిపిన్(22) ఐస్‌క్రీం అమ్ముకొంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై వస్తుండగా వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు బొలేరో వాహనం డ్రైవర్ స్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.



ఆంజనేయులు గౌడ్ (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: బైక్‌ను లారీ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల ఊరేగింపు నిర్వహించారు. మెదక్ పట్టణం నర్సిఖేడ్‌కు చెందిన ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్ కలిసి బోనాల ఊరేగింపునకు వెళ్లారు. తిరిగి వస్తుండగా పట్టణ శివారులోని సాయిదత్త థియేటర్ వద్ద బైక్‌ను లారీ ఢీ కొట్టింది. ఆంజనేయులు గౌడ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు కుటుంబీకుల ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వస్త్ర వ్యాపారి బలవన్మరణం

- ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో
- సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు నా భార్యాబిడ్డలను ఆదుకోండి



రాజు మృత దేహం

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో ఓ వస్త్ర వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం తూప్రాన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంట మండలం చందాయిపేట గ్రామానికి చెందిన బిట్ల రాజు(35) కొంత కాలంగా తూప్రాన్‌లో రేడీమేడ్ వస్త్ర దుకాణం నడుపుతున్నాడు. కొన్నాళ్ల పాటు వ్యాపారం సజావుగా సాగింది. ఆ తర్వాత ఆర్థికం ఇబ్బందులు పెరిగాయి. దీంతో నిత్యం మనస్తాపానికి గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య యత్నించగా కుటుంబ సభ్యులు నచ్చజెప్పారు. కాగా ఇటీవల అప్పులు ఇచ్చినవారి నుంచి ఒత్తిగి ఎక్కువ కావడంతో తాను నిర్వహిస్తున్న షాపులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో

రాజు ఆత్మహత్యకు ముందు రోజు సెల్ఫీ వీడియో తీసుకొన్నట్లు స్థానికులు తెలిపారు. వీడియోలో కన్నీరు పెడుతూ సారూ 'వ్యాపారంలో చాలా నష్టపోయాను సుమారు రూ.20 లక్షల వరకు అప్పు అయ్యింది. అప్పు తీర్చేందుకు తెలిసి వారి నుంచి అప్పు చేశాను. రూ.100కు రూ.8 రూపాయాల చొప్పున చెల్లించా. అయిన అప్పు ఇచ్చిన వారు వేధించడంతో పాటు షాపు వద్దకు వచ్చి ఇష్టం వచ్చినట్లు భూతులు తిడుతున్నారు. సొంత బావ కూడా మోసం చేశాడు. బట్టల కోసం కలకత్తాకు వెళ్లి మోసపోయాను. ఇందుకు కారణం మా బానే. అప్పుల బాధతో, ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకుంటున్న అన్న. నాకు ఎవరినీ ముంచాలని లేదు. అప్పుల వాళ్లు ఇజ్జత్ తీస్తున్నారని చేసుకుంటున్న.' సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు నా కుటుంబాన్ని ఆదుకోండని వేడుకున్నాడు. ఈ వీడియోని చనిపోయేముందు తన స్నేహితులకు పంపించాడు. రాజు సెల్ఫీ వీడియో వైరల్‌గా మారడంత పట్టణంలో చర్చనీయంశంగా మారింది.

యాప్రాల్ నుంచి వచ్చి అలిరాజ్‌పేటలో శవమై

జగదేవ్‌పూర్(గజ్వేల్): యాప్రాల్ నుంచి వచ్చిన యువకుడు అలిరాజ్‌పేటలో శవమై కనిపించాడు. ఈ సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజ్‌పేట గ్రామ శివారులోని బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా యప్రాల్‌కు చెందిన పల్లె మహేందర్(21) పది రోజుల క్రితం స్నేహితులతో కలిసి జగదేవ్‌పూర్ మండలం కొండ పోచమ్మ ఆలయానికి వచ్చాడు. తోటి స్నేహితులు తిరిగి ఇంటికి వెళ్లగా మహేందర్ ఇక్కడే ఉండిపోయారు. బుధవారం అలిరాజ్‌పేట శివారులోని పత్తి పంటలో శవమై కనిపించాడు. వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణమూర్తి చేరుకుని వివరాలు సేకరించారు. మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా మృతుడు కొద్ది నెలలుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుప్రతికి తరలించారు.



మహేందర్ మృతదేహం